

సాక్షి
బాపట్ల
శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.60 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,520 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 236 క్యూసెక్కులు వదిలారు.

పంచముఖ గాయత్రీదేవిగా భువనేశ్వరి అమ్మవారు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ నీలకంఠేశ్వరి స్వామి దేవస్థానంలో అమ్మవారు గురువారం పంచముఖ గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

నలుగురూ మెచ్చేలా..


- ఉద్దండులకు ఉన్నత పురస్కారం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నలుగురికి 'వైఎస్సార్' అవార్డులు
- సర్వత్రా హర్షాతిరేకాలు

వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్/వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డులను రాష్ట్రప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు విశిష్ట వ్యక్తులను సమున్నత పురస్కారం వరించింది. హరికథకుడు, తొలి తరం నేపథ్యగాయని, జిల్లాతో అనుబంధం కలిగిన నాదస్వర దంపతులు, బ్యాడ్మింటన్ కోచ్ ఈ అవార్డులకు ఎంపిక కావడం విశేషం.

– తెనాలి

హరి'కథానాయకుడు'

తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్. ఆయన రామాయణ, భారత, భాగవతాలనూ శ్రావ్యంగా, సరస చతురోక్తులతో పండిత, పామర జనరంజకంగా గానం చేసి హరికథకు విశేష ప్రాచుర్యం కల్పించారు. ఏడు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. తల్లిదండ్రులు వెంకట శివయ్య, సుబ్బమ్మ. పురోహితుడైన తండ్రి దగ్గరే శాస్త్రి చిన్నతనంలో వేదవిద్య అభ్యసించారు. బ్రాహ్మణకోడూరులోని మధూకర వృత్తితో పమిడిమర్రు సుబ్బావధానులు దగ్గర వేదవిద్య నేర్చారు. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణంతో ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగబిడ్డల్లో పెద్దవాడైన సచ్చిదానందశాస్త్రికి కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. పౌరోహిత్యం చేస్తూనే, స్వయంగా కథాగానం సాధన చేశారు. అదే జీవనాధారమైంది. 56 ఏళ్ల క్రితం గుంటూరులో స్థిరపడ్డారు. ఎంతో మందికి శిక్షణనిచ్చారు. చతురోక్తులు, సరస సంభాషణలతో హరికథాగానం చేయడం సమకాలీన అంశాలను చొప్పించడం శాస్త్రి ప్రత్యేకత.



కోట సచ్చిదానందశాస్త్రి

దీనివల్ల ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్ట య్యారు. రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న'తో ఆయనను గౌరవించింది. 'హరికథా సామ్రాజ్య సార్వభౌమ', 'కథాగాన కళాకోవిద', హరికథాగాన కళారవ' వంటి బిరుదులెన్నో పొందారు. 2019లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు స్వీకరించారు. గత జనవరిలో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. పద్మశ్రీ అందుకున్న ఏకైక హరికథకుడిగా కీర్తి గడించారు. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వ అవార్డును అందుకోనున్నారు.

జతగా జయని'నాద'ం

శుభకరమైన నాదస్వరం భారతీయులకే పరిమితమైన గొప్ప సంగీతం. కలైమామణి షేక్ కాలేషాబీ, మహబూబ్ సుభాని దంపతులు ఆసియాలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీరంగం కేంద్రంగా దేశవిదేశాల్లో నాదస్వర కచేరీలు ఇస్తున్నారు. నాదస్వర విద్వాన్ షేక్ చినమౌలానా శిష్యురాలు షేక్ కాలేషాబీ. భర్త మహబూబ్ సుభానితో కలిసి ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. స్వస్థలం ప్రకాశం జిల్లా. చిలకలూరిపేటకు చెందిన చినపీరుసాహెబ్ మనుమడు మహబూబ్ సుభాని. కర్నూలులోని శారదా సంగీత కళాశాలలో దంపతులిద్దరూ సంగీత సాధన చేశారు. శ్రీరంగంలోని పద్మశ్రీ చినమౌలానా సంగీతాశ్రమంలో మెరుగులు దిద్దుకున్నారు. తమిళనాడులోని తిరువయ్యారులో జరిగిన సంగీతోత్సవాల్లో అనుకోకుండా లభించిన అవకాశంతో ఇక వెనుదిరిగి చూడలేదు. తమిళనాడులోని అన్ని దేవస్థానాల్లోనూ కచేరీలిచ్చారు. దేశవిదేశాల్లో వేలాది కచేరీలు చేశారు. ఆదరించిన శ్రీరంగంలోనే స్థిరపడ్డారు. 1994లో తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి' బిరుదుతో సత్కరించింది. కుమార్తెల్లో ఒకరైన మీరాబాయిని తెనాలి ఇచ్చారు. మాజీ రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ కుటుంబానికి ప్రత్యేకంగా కచేరి



కాలేషాబి మహబూబ్ సుభాని దంపతులు

నిచ్చారు. అనంతరం రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై 2004లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఇతర అతిథులకు తమ నాదస్వరంతో వీనుల విందు చేశారు. ఆయన కోరికపై మానసిక వికలాంగుల పాఠశాలలకు వెళ్లి నాదస్వర కచేరీలనిచ్చారు. అబ్దుల్ కలాం సూచించినట్టే కుమారుడు ఫిరోజ్‌బాబు నాదస్వరంలో ప్రావీణ్యత సాధించి, తల్లిదండ్రులతోపాటు కచేరీలు చేస్తున్నారు. సుభాని దంపతులు పద్మశ్రీ గౌరవం స్వీకరించారు.

సంగీత 'సరస్వతి'



తొలి తరం నేపథ్య గాయని రావు బాల సరస్వతి. అనుకరణలకు అతీతమైన అద్భుతస్వరం ఆమె సొంతం. సంగీతంలో ప్రత్యేక శిక్షణ లేకుండానే తనదైన శైలి, బాణీలో విశిష్ట తను సాధించారు. సినీ సంగీతంలో కొత్త ఒరవడిని ప్రారంభించారు. లలిత సంగీతం పేరుతో నూతన విభాగాన్ని ఆవిష్కరించిన విదుషీమణి ఆమె. స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల. 1928 ఆగస్టు 28న జన్మించారు. తండ్రి పార్థసారథిరావు సంగీతప్రియులు. గుంటూరులో రత్నా థియేటర్ నిర్మించారు. తండ్రిలానే బాలసరస్వతికి సంగీతం చిన్ననాటనే అబ్బింది. అప్పట్లో గుంటూరులో 'హెచ్ఎంవీ' గ్రామఫోను కంపెనీ ఉండేది. ఆ కంపెనీకి ఆరేళ్ల వయసులో సోలో రికార్డు పాడిన ఘనత దక్కించుకున్నారు. సుప్రసిద్ధ దర్శకుడు సి.పుల్లయ్య తీసిన 'సతీ అనసూయ-భక్తధృవ' సినిమాలో బాలనటిగా అవకాశం వచ్చింది. గంగ పాత్రలో నటించి పాడిన పాట పెద్ద హిట్టయింది. ఆ సినిమాలో నటిస్తుండగానే తమిళ చిత్రం 'భక్త కుచేల'లో రెండు వేషాల్లో నటించారు. పాటలు కూడా తనవే. మరో తమిళ సినిమా 'బాలయోగిని'లో టైటిల్ రోల్ పోషించారు. ఆ సినిమా తర్వాత చెన్నైలో సెటిలయ్యారు. ఎదిగాక మరికొన్ని సినిమాల్లో మంచి పాత్రల్లో నటించారు. 1944లో కోలంక జమీందారుతో వివాహంతో నటనకు స్వస్తిపలికి పాటలకు పరిమితమయ్యారు. 1941లో రేణుకావారి 'భాగ్యలక్ష్మి' సినిమాలో ఆమె తొలి ప్లేబాక్ పాట పాడారు. సినిమాలకు పాడుతూనే ఎస్.రాజేశ్వరరావుతో కలిసి లలిత సంగీతం పేరిట కొత్త విభాగాన్ని ఆవిష్కరించారు. లక్షల సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్నారు. 1946లో సింహళ చిత్రం లైలామజ్నూకు సంగీతం సమకూర్చారు. 1974లో భర్త మరణం, దివాణాలు, వైభవాలు అంతరించటంతో చెన్నై, మైసూరు, బెంగళూరు తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 2015లో గుంటూరులో బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ బాలసరస్వతిని విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించి రూ.లక్ష నగదు, రజత జ్ఞాపికను అందజేశారు. 'నిండుపున్నమి వెన్నెల'గా అభినందన సంచికను విడుదల చేశారు.

పురస్కారం అందు'కోచ్'

మార్టూరు: ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌ను వైఎస్సార్ అవార్డు వరించింది. బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా, కోచ్‌గా అద్భుతంగా రాణించి అందరికీ సుపరిచితమైన ఈయనకు ఇంకొల్లు మండలం నాగండ్లకు అవినాభావ సంబంధం ఉంది. పుల్లెల గోపీచంద్ తల్లి సుబ్బరావమ్మ స్వగ్రామం ఇంకొల్లు మండలం నాగండ్ల. తండ్రి సుభాష్ చంద్రబోస్ స్వగ్రామం జే.పంగులూరు మండలం ఆరికట్లవారిపాలెం. వీరి కుటుంబం తాతల హయాం నుంచి నిజామాబాద్ జిల్లా ధర్మవరంలో వ్యవసాయ రీత్యా స్థిరపడింది. గోపీచంద్ తండ్రి చంద్రబోస్ బ్యాంక్ ఉద్యోగి. ఉద్యోగరీత్యా చీరాల, ఒంగోలు ప్రాంతాల్లో పనిచేసినప్పుడు గోపీచంద్ విద్యాభ్యాసం ఈ రెండు ప్రాంతాల్లో జరిగింది. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ స్థాపించి ఎందరినో అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు.



న్యూస్‌రీల్

మహాలక్ష్మీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో గురువారం బాలచాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో గాయత్రిదేవి, కోదండరామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

సాగర్ జలాలు పొదుపుగా వాడుకోండి



నరసరావుపేట: సాగర్ జలాలను వచ్చే జనవరి వరకు పొదుపుగా వాడుకోవాలని ఎన్ఎస్పీ సూపరింటెండెంట్ ఇంజినీర్ దర్శిగుంట వరలక్ష్మి పేర్కొన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేటలలో సాగర్ జలాలతో మంచినీటి చెరువులను నింపుతున్న సందర్భంగా గురువారం ఆమె కుడికాలువ అధికారులతో కలిసి పరిశీలించారు. వారు సంబంధిత మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. జనవరి వరకు ఈ సాగర్ జలాలను పొదుపుగా వాడుకోవాలన్నారు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్న దృష్ట్యా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు మళ్లీ జనవరిలో సాగర్ జలాలు నాగార్జునసాగర్ నుంచి విడుదల చేయవచ్చన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రేపూడి మల్లికార్జునరావు. డెప్యూటీ ఈఈ ముకిరి ఉమాశంకర్, ఏఈ బొంగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఎంప్లాయీస్ గ్రీవెన్స్

నరసరావుపేట: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు డీఆర్వో కె.వినాయకం గురువారం వెల్లడించారు. జిల్లాలోని ఉద్యోగులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఆర్టీసీలో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ప్రజారవాణా అధికారి కార్యాలయంతోపాటు పలు డిపో మేనేజర్ల కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి ఎన్వీ శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. ఉద్యోగులు ఆన్‌లైన్ లేదా వ్యక్తిగతంగా కలిసి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

రేపు ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయం వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

అమరేశ్వరునికి విరాళం



అమరావతి : అమరేశ్వరాలయంలో జరిగే నిత్యాన్నదానానికి గురువారం గుంటూరుకు చెందిన వనమా పూర్ణచంద్రరావు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో పూజల అనంతరం ఈవో వేమూరి గోపీనాథ శర్మకు నగదును అందజేశారు.


పేదల 'ఇంటి'వేల్పు జగన్

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- రేపల్లెలో 133 గృహాల సముదాయం ప్రారంభోత్సవం



గృహాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో నెరవేరిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. పేదల ఇంటివేల్పు జగన్ అని అభివర్ణించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గృహనిర్మాణశాఖ, గ్రామ పునర్నిర్మాణ సంస్థ(వీఆర్‌వో) సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలో బుధవారం ఎస్టీ లబ్ధిదారులకు కొత్తగా నిర్మించిన 133 గృహాల సముదాయ ప్రారంభోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత నవరత్న పథకాలతో వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. పేదవానికి కనీస అవసరాలైన కూడు, గూడు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షల మందికి నివేశన స్థలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతోందని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా రేపల్లెలో పట్టణానికి ఆనుకుని 63 ఎకరాలలో 3,009 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు అందించామని చెప్పారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదన్న స్వార్థపూరిత ఆలోచన చంద్రబాబుదని విమర్శించారు. రాజధానిలోనూ నిరుపేదలు దర్జాగా ఉండాలన్న సంకల్పం జగనన్నదని పేర్కొన్నారు. దీనికి ఉదాహరణగా అమరావతి ప్రాంతంలో వేలాది మంది పేదలకు నివేశన స్థలాలు అందించి వారి జీవితాలలో వెలుగులు నింపింది జగనన్న అని కొనియాడారు. తొలుత గృహాల సముదాయాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునతో కలిసి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. లబ్ధిదారులకు కొత్త వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, గృహనిర్మాణ సంస్థ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అజయ్‌జైన్,



సభలో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు చిత్రంలో ఎంపీ సురేష్

జాయింట్ కలెక్టర్ శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, హౌసింగ్ డీఈ సుబ్బారావు, కౌన్సిలర్ అద్దేపల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

అద్దె భారం నుంచి విముక్తి



కూలి పనులు చేసుకుని జీవించే మాకు 1వ తేదీ రాగానే అద్దె చెల్లించాలంటే భారంగా ఉండేది. ముఖ్యమంత్రి జగనన్న కృషితో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆధ్వర్యంలో మా సొంతింటి కలను సాకారం చేశారు. నివేశన స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాను.

– విజయలక్ష్మి, 26వవార్డు, రేపల్లె

వైఎస్సార్ సీపీకి అండగా ఉంటాం



పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో అద్దెకు ఉంటున్నాం. కూలి పనిచేసుకుని జీవించే మాకు స్థలం కొని ఇల్లు కట్టుకునే ఆర్థికస్తోమత లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువ, మోపిదేవి వెంకట రమణారావు చొరవతో మాకు సొంతగూడు సమకూరింది. జగనన్న, రమణన్నకు రుణపడి ఉంటాం. వైఎస్సార్ సీపీకి అండగా ఉంటాం.

– నాగేంద్రం, వీర్లంకయ్య, 13వ వార్డు, రేపల్లె

జగనన్నకు రుణ పడి ఉంటాం



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ఉప్పూడి కాల్వకట్టపైనే గుడిసె వేసుకుని జీవిస్తున్నాం. నివేశన స్థలం కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక నివేశన స్థలం మంజూరైంది. వేట, కూలి పనులు చేసుకుని పొట్టపోసుకునే మాకు ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. ప్రభుత్వమే గృహం నిర్మించి ఇచ్చింది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– దుర్గ, బుచ్చయ్య, 13వ వార్డు, రేపల్లె

నేడు ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం పేర్కొన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రీవెన్స్ ప్రారంభమవుతుందని వివరించారు. వినతిపత్రాల ద్వారా తమ సమస్యలు నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగులు ఎవరైనా ధైర్యంగా తమ సమస్యలు విన్నవించుకోవచ్చన్నారు. గ్రీవెన్స్‌సెల్‌కు రాదలచిన ఉద్యోగులకు అనుమతులు ఇవ్వాలని, వారిని ఆటంకపరచరాదని అన్ని శాఖల జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్‌ను ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతినెలా 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం తప్పనిసరిగా కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అర్జీనీ ప్రత్యేక పోర్టల్‌లో నిక్షిప్తం చేసి వారికి తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో అగ్నిప్రమాదం

రూ.కోటికిపైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లులోని వస్త్ర తయారీ ఫ్యాక్టరీ ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో గురువారం వేకువ జామున సుమారు 3 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రూ.కోటికిపైగా ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్టు సమాచారం. మంటలను చూసిన కార్మికులు ఒక్కసారిగా అందరినీ అప్రమత్తం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అద్దంకి, చీరాల, ఒంగోలు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంమీద మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఫ్యాక్టరీలోని వస్త్రాలతో పాటు మిషనరీ కూడా మంటల్లో కాలి బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆమంచి

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్పిన్నింగ్ మిల్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, చీరాల ఆర్డీఓ సరోజిని, తహసీల్దార్ బ్రహ్మయ్య, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నరసింహం, ఇంకొల్లు, చినగంజాం ఎస్ఐలు నాయబ్ రసూల్, కే సురేష్, సర్పంచ్ ప్రసన్న, కొణికి సర్పంచ్ బాజీ, శ్యాంబాబు, ధనుంజయ్, షమీం, మాలిక్, ప్రసాద్, నాని, సుభాని, టి.చలమయ్య ఉన్నారు.



ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

వృత్తికి ఉపకారం



చేదోడు నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్‌శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

- జగనన్న చేదోడు నాలుగో విడత సాయం జమ
- జిల్లాలో 9,938 మందికి లబ్ధి
- రూ.9.93 కోట్ల మేర ప్రయోజనం

బాపట్ల: వృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో జగనన్న చేదోడు పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వేదికగా గురువారం జగనన్న చేదోడు పథకం నాలుగో విడత ఆర్థిక సాయం విడుదలను బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని లబ్ధిదారులంతా తిలకించేలా అధికారులు స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జగనన్న చేదోడు పథకం ద్వారా జిల్లాలో 9,938 మంది లబ్ధిదారులకు రూ.9.93 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తున్నట్టు వివరించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలిసి లబ్ధిదారులకు నమూనా చెక్కును అందించారు. ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఏడుకొండలు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి బి.అర్జునరావు, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈవో చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కీర్తి గడించిన పుత్రుడి వల్లే తల్లిదండ్రులకు గౌరవం



పాత గుంటూరు: జన్మనిచ్చిన తల్లిదండ్రులకు నిజమైన గౌరవం కీర్తి గడించిన పుత్రుడి వల్ల మాత్రమే దక్కుతుందని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. శ్యామలానగర్ శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రాంగణంలో వేద పరిషత్ స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదిశంకరుల అద్వైతామృతత్త్వముపై ప్రవచనం చేశారు. జగత్తులోని తత్త్వాలు సమగ్రంగా పరిశీలించి, అద్వైత తత్త్వాన్ని ప్రతిపాదించినట్లు చెప్పారు. సాగర ఘోష కావ్యంలో శంకరుని తత్త్వాన్ని అడుగడుగున స్పృశించినట్లు పేర్కొన్నారు. జీవ సమానత్వమే అద్వైత మూలమని చెప్పారు. మమకార బంధాలు విముక్తి చెందటానికి అద్వైత తత్త్వం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గబ్బిట శివరామ కృష్ణప్రసాద్, సాహితీ ప్రియులు, వేదాభిమానులు పాల్గొన్నారు.

యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు (గుంటూరు వెస్ట్) : విజయదశమి పర్వదినం సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా సెలవులు వచ్చాయి. శని, ఆది వారాలు సాధారణ సెలవులు ఉండటంతో, సోమ, మంగళవారాలు రాష్ట్ర ప్రభుత్వం మిర్చి యార్డుకు సెలవులు ప్రకటించిందని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 25వ తేదీ బుధవారం నుంచి యార్డులో యధావిధిగా క్రయ, విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. రైతులు సెలవు రోజుల్లో యార్డుకు మిర్చి బస్తాలు తీసుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

- అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు శిక్ష తప్పదు
- తప్పుడు ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా
- వై ఏపీ నీడ్స్ జగన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- సామాజిక న్యాయ యాత్రలో భాగస్వాములు కావాలి
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నియోజక వర్గంలోని సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతుందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఆప్యాయంగా ఆదరిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయిన తర్వాత ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు పారదర్శకంగా అంద జేయడం జరిగిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడిన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు శిక్ష తప్పదన్నారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నాయకులు అడప దడప నిరసనలు చేస్తున్నారే తప్ప ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఒక్క స్కిల్ డెవలప్‌మెంట్ కేసులోనే కాకుండా అనేక వ్యవహారాల్లో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని, త్వరలోనే అవి కూడా బయటపడటం ఖాయమన్నారు. కొన్ని వ్యవస్థలను అడ్డుపెట్టుకొని నీతిపరుడి ముసుగులో ఇన్నాళ్లు ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. పాపం పండడంతో ఆధారాలతో సహా దొరికిపోయాడని, ఇక కోర్టు నుంచి శిక్ష తప్పించుకోలేరన్నారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ అతిగా స్పందించి ప్రజలు ముక్కున వేలేసుకునేలా చేశాడన్నారు. చంద్రబాబును జైల్లో కలిసి టీడీపీకి మద్దతిస్తా, ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని నిసిగ్గుగా అవినీతికి మద్దతు ప్రకటించేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇద్దరూ కలిసి పోటీ చేసినా ఒరిగేదేమీ లేదు ...

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ కలిసి పోటీ చేసినా ఒరిగేదేమీ లేదని, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే గెలుపొందుతారన్నారు. 2014లో పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేయలేదని, చంద్రబాబు జెండా పట్టుకుని దేశమంతా తిరిగి ఆయనను గెలిపించాడన్నారు. 2019లో మళ్లీ పవన్ కల్యాణ్ ఒంటరిగా పోటీచేసి చంద్రబాబు దుర్మార్గుడు, దోపిడీదారుడు, రూ.లక్ష కోట్లు తిన్నాడంటూ ప్రజల్లో ప్రచారం చేశాడన్నారు. మళ్లీ చంద్రబాబుతో కలిసి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ముందుకు వస్తున్నాడన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు అయినప్పటి నుంచి ఓవర్గం మీడియా గగ్గోలు పెడుతుందన్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత రాష్ట్రం అతలాకుతలం అవుతుందంటూ ఓ సెక్షన్ ఆఫ్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తుందని, నిరసన తెలుపడానికి టీడీపీ నాయకులే ముందుకు రావడం లేదన్నారు. ఆ పార్టీ ముఖ్య నాయకులే విచారం వ్యక్తం చేస్తున్నారన్నారు. కానీ ఓ వర్గం మీడియా మాత్రం తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి తనను టార్గెట్ చేసి ఓడించాలని యత్నిస్తున్నారని, ప్రజలందరీ ఆశీర్వాదం ఉన్నంతకాలం వారిరువురి ప్రయత్నాలు సత్తెనపల్లిలో ఫలించవన్నారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పాలన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సాగుతున్న నేపథ్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈనెల 28 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక న్యాయ యాత్రలను ప్రారంభించాలని ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని, ఈ యాత్రలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లం చర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు షేక్ మౌలాలి (సత్తెనపల్లి టౌన్), రాయపాటి పురుషోత్తమరావు (సత్తెనపల్లి రూరల్), నక్కా శ్రీనివాసరావు (ముప్పాళ్ల), వేపూరి శ్రీనివాసరావు (రాజుపాలెం), భవనం రాఘవరెడ్డి (నకరికల్లు), జేసీఎస్ ఇన్‌చార్జి బొంతు వెంకటరెడ్డి మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సురిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగంతోపాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలి



పుస్తకాలు, పెన్నులు డొనేట్ చేసిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పాతగుంటూరు: ఉద్యోగులు తమ ఉద్యోగ బాధ్యతలతో పాటు సమాజంలో పేదలను ఆదుకునేందుకు సహాయాన్ని అందించే ప్రక్రియలో కూడా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంపాలెంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో బాక్స్ అఫ్ కైండ్ నెస్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డితో కలసి ప్రారంభించారు. బాక్స్ అఫ్ కైండ్ నెస్ కార్యక్రమం ద్వారా సేకరించిన పాత వస్తువులు, పాత బొమ్మలు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్, బట్టలు, ఇతర పునర్వినియోగ వస్తువులు అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, నిరుపేదలకు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి మొదటిగా పుస్తకాలు, పెన్నులు, బట్టలను స్వచ్ఛందంగా డొనేట్ చేశారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

బాపట్ల డీఎంహెచ్‌వో ఎస్. విజయమ్మ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ పక్కన వైద్యురాలు రామలక్ష్మి

భట్టిప్రోలు: మలేరియా లాంటి తీవ్ర జ్వరాల వ్యాధుల బారిన పడిన చిన్నారులు, గర్భిణులను గుర్తించి వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందించాలని బాపట్ల డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వైద్యశాలలో రికార్డులను, ప్రాంగణాన్ని, గదులను పరిశీలించారు. ఐరస్ సుక్రోజ్ పెట్టించుకుంటున్న మహిళను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను తరచూ పరీక్షలు నిర్వహించాలని ఇందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించి... ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతి నిత్యం ఇంటింటికి తిరిగి కులాసాగా ఉన్నారా అని పలకరించి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వైద్యుల సూచనల మేరకు వారిని మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

మేలుజాతి పశువుల పెంపకంతో పాలదిగుబడి

జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ చెన్నయ్య



పశు విజ్ఞానబడిలో సూచనలు అందిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ చెన్నయ్య

చీరాల టౌన్: మేలుజాతి పశువుల పెంపకం ద్వారా అధికపాల దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఆర్.చెన్నయ్య సూచించారు. గురువారం మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపురుపాలెం పశువైద్యురాలు డాక్టర్ వై.పావని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి చెన్నయ్య మాట్లాడుతూ మేలు జాతి పశువులను పెంచుకోవడం వలన సీజనల్ వ్యాధులను తట్టుకోవడంతో పాటుగా అధిక పాలదిగుబడి వస్తుందన్నారు. ఫలితంగా పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. పశువులకు వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్య సేవలు అందించడం వలన పాడిరైతులకు ఎలాంటి నష్టం సంభవించదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పెయ్యి దూడల ఉత్పత్తి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలని ఆయన కోరారు. జిల్లా పశువైద్యాధికారి హనుమంతరావు మాట్లాడుతూ రైతులకు దూడల పెంపకంలో మెళుకువలు పాటించాలని, గర్భకోశ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, పశుకిసాన్ క్రెడిట్ కార్డుల గురించి పశుపోషకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం దూడలకు నులి పురుగు నివారణ మందులతో పాటుగా పాడి పశువులకు దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీరాల ఏడీ డాక్టర్ చిట్టిబాబు, పశువైద్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

రైళ్లలో దొంగతనాలు అరికట్టాలి

గుంతకల్లు, నెల్లూరు రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు



రికార్డులు పరిశీలిస్తున్న గుంతకల్లు, నెల్లూరు రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు

చీరాల రూరల్: రైళ్లలో దొంగతనాలు అరికట్టి ప్రయాణికులకు భద్రత కల్పించాలని గుంతకల్లు, నెల్లూరు రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం డీఎస్పీ చీరాల జీఆర్పీ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు ఏ మేరకు ఉన్నాయని ఎస్సై సీహెచ్ కొండయ్యను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బంది పనితీరును పరిశీలించి మాట్లాడారు. నేరాలను ఏవిధంగా అరికట్టాలనే విషయాలపై ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. రాత్రి వేళల్లో రైళ్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికుల తీరును గమనిస్తుండాలని సూచించారు. రైలు ఆగిన సమయంలో ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో దొంగలు కూడా ప్రయాణికుల మాదిరిగా సంచరిస్తుంటారని వారి కదలికలను గమనిస్తూ నేరగాళ్ల ఆటకట్టించాలని సూచించారు. పాత నేరస్తులను, షీట్లు ఉన్న వారిని గమనిస్తుండాలని, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుంటే అదుపులోకి తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి ఆయా కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. డీఎస్పీ వెంట ఒంగోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీకాంత్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

అతడు నకిలీ డాక్టర్ కాదు

మీడియా సమావేశంలో డాక్టర్ కొండలరావు వివరణ



తన ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు చూపుతున్న డాక్టర్ ఫణి

చీరాల అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో నకిలీ డాక్టర్ వైద్యపరీక్షలు చేశాడని పలు మీడియాలలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని.. అతడు ఎంబీబీఎస్ డాక్టర్ అని ఐకాన్ హాస్పిటల్ అధినేత, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కొండలరావు తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. బుధవారం చీరాల ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ఎముకలు, కీళ్ల విభాగంలో చీరాల ఐకాన్ హాస్పిటల్ డాక్టర్ కొండలరావు వైద్యసేవలందించేందుకు తన పేరు ఇచ్చానన్నారు. అయితే ఎమర్జెన్సీ కేసు ఉండడంతో చైనాలో ఎంబీబీఎస్ చేసిన తన అసిస్టెంట్ ఫణి రోగుల నుంచి వివరాలను మాత్రమే సమోదు చేశారన్నారు. అయితే అతను డాక్టర్ కాదని, కాంపౌండర్ అని మీడియాలో రావడం బాధాకరమన్నారు. ఈ వార్త మీడియాలో రావడంతో తాను క్యాంపునకు వెళ్లానన్నారు. హాస్పిటల్ నుంచి డాక్టర్‌గా అతని పేరు కూడా ఇవ్వలేదన్నారు. ఎముకలు, కీళ్ల విభాగానికి అంటించిన బోర్డులో పేరు తప్పుపడిందని, టైపింగ్‌లో తప్పుగా రాశారని, అది తమ తప్పు కాదన్నారు. ఇదే విషయాన్ని డీఎంహెచ్‌ఓకు కూడా వివరణ ఇచ్చామన్నారు. డాక్టర్ ఫణి తమ వద్దనే ఐదేళ్లుగా డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్నాడన్నారు. సొంత హాస్పిటల్ ఏర్పాటు చేసుకుని డాక్టర్ వృత్తి చేసుకోవడానికి ఐఎంఏలో సభ్యత్వం అవసరమని చెప్పుకొచ్చారు. అలానే అతడి సర్టిఫికెట్లు కూడా కలెక్టర్‌కు పంపించామన్నారు. తాను జిల్లా డాక్టర్స్ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నానని, చీరాల మండలంలో ఏర్పాటు చేసిన సురక్ష క్యాంపులో పాల్గొని మూడు రోజులు పాటు సేవలందించానన్నారు. అవాస్తవాన్ని వాస్తవంగా ప్రచారం చేశారన్నారు.

రేపల్లె ఆర్డీఓగా హేలా షారోన్

రేపల్లె రూరల్: రేపల్లె ఆర్డీఓగా హేలా షారోన్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న జగన్నాధం పార్థసారథిని డిప్యూటీ కలెక్టర్ సాధారణ పరిపాలన (ఎస్.సీ.బీ) విభాగంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రేపల్లె ఆర్డీఓగా నియమితులైన హేలా షారోన్ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నికర ఆదాయం



జే.పంగులూరు: ప్రకృతి వ్యవసాయంలో 360 రోజులు నికర ఆదాయం పొందవచ్చని జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని రామకూరు గ్రామంలో రెహమాన్, బ్రహ్మ కిషోర్ 40 సెంట్లలో వేసిన మోడల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ నికర ఆదాయంతోపాటు మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చన్నారు ఈ పరిశీలనలో యూనిట్ ఇన్‌చార్జి రాజశేఖర్, రెహమాన్, కోలలపూడి యూనిట్ ఇన్‌చార్జి , ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

వృద్ధుడి ప్రాణాలు తీసిన భూ వివాదం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పొన్నూరు రూరల్ సీఐ రాంబాబు

చేబ్రోలు: భూ వివాదంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని వృద్ధుడిని హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో జరిగింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వేజండ్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన కొండా రామకృష్ణారెడ్డి (68) అదే గ్రామానికి చెందిన యర్రంరెడ్డి అంకిరెడ్డికి మధ్య కొంతకాలంగా భూ వివాదం ఉంది. 2006 సంవత్సరంలో మృతుడు రామకృష్ణారెడ్డి, యర్రంరెడ్డి అంకిరెడ్డి, పఠాన్ సత్తార్‌లు ముగ్గురు కలిసి వేజండ్ల గ్రామంలో 3.91 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ముగ్గురు కలిసి జాయింట్‌గా సాగు చేసుకుంటున్నారు. కొద్ది సంవత్సరాలుగా వీరి మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. భూ పంపిణీలో అభిప్రాయబేధాలు ఏర్పడ్డాయి. దీనిపై కోర్టులో దావా వేయటంతో న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నది. ఈ సంఘటన నేపథ్యంలో రెండు రోజుల క్రితం రామకృష్ణారెడ్డి, అంకిరెడ్డి ఘర్షణ పడ్డారు. అంకిరెడ్డి ట్రాక్టర్‌తో పొలం పనులు చేశాడు. బుధవారం రామకృష్ణారెడ్డి పొలం పనుల కోసం సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. గ్రామంలోని దద్దనం సెంటర్ నుంచి బొమ్మగుంట డొంక ప్రాంతంలోకి వెళ్లే సమయంలో అంకిరెడ్డి ట్రాక్టర్‌తో సైకిల్‌పై ఉన్న రామకృష్ణారెడ్డిని ఢీ కొట్టడంతో మృతి చెందాడు. మృతుని భార్య కొండా అలివేలమ్మ ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ సీఐ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

రైతులు సమన్వయంతో నీటివృథా అరికట్టాలి

ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు

తెనాలిటౌన్: రైతులందరూ సమన్వయం పాటించి నీటిని వృద్ధా చేయకుండా పొలాలకు నీరు పెట్టుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఉమామహేశ్వరరావు తెలిపారు. రూరల్ మండలంలోని హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పొలాలను వ్యవసాయశాఖ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సందర్శించారు. వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్న తరుణంలో రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అధికారులు పొలాలను పరిశీలించారు. రైతులతో అధికారులు మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొలాలకు నీరు అందక పంటలు దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఇరిగేషన్‌శాఖ అధికారుల సహాయంతో సత్వరమే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్ఈ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరులోని వరి పొలాలకు నీరు అందించే ప్రయత్నం ప్రారంభించారని తెలిపారు. రైతులు సమన్వయంగా ఉండాలని కోరా రు. వీలైనంత వరకు చివరి పొలం వరకు నీరు అందిస్తామని తెలిపారు. రైతులు సమన్వయం పాటించి నీరు పెట్టుకునేందుకు సహకరించాలని కోరారు.